

ఎంత పే...ద్ద చేపలో!

కాశిమేడు మార్కెట్‌కు 350 కిలోల సొర చేపలు

స్థానిక కాశిమేడుకు చెందిన ఓ జాలరి పంట పండింది. వేటకు వెళ్లిన అతని వలలో ఏకంగా సొర చేపలే పడ్డాయి. అతని వలలో 350 కేజీల బరువుండే రెండు పాల్ సొర చేపలు చిక్కాయి. వీటిని మంగళవారం తీరానికి తీసుకురాగా, భారీ క్రేన్ సాయంతో ఒడ్డుకు చేర్చారు. వారం రోజుల క్రితం సముద్రంలోకి వేటకు వెళ్లిన జాలర్లలో రమేష్ వలకు ఈ రెండు చేపలు చిక్కాయి.

- అడయార్, ఆంధ్రజ్యోతి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొద్దిసేపు ఫొటోగ్రాఫర్ అవతారమెత్తారు. నిత్యం తన ఫొటోలు తీస్తూ, తనకు ప్రచారం కల్పిస్తున్న ఫొటోగ్రాఫర్లను తనే స్వయంగా ఫొటో తీశారు. అంతేనా.. వారందరినీ తన దగ్గరికి పిలిచి మరీ ఫొటోలు దిగి, సందడి చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యేటా ఫొటో జర్నలిస్టులు, కెమెరామెన్ స్టాలిన్‌ను కలుసుకోవడం ఆనవాయితీ. ఈ మేరకు మంగళవారం ఉదయం ఆయన నివాసానికి ఫొటోగ్రాఫర్లందరూ వెళ్లారు. అప్పటికే వారి రాక కోసం ఎదురు చూస్తున్న సీఎం.. అందరినీ దగ్గరకు పిలిపించుకున్నారు. అందరితోనూ కలివిడిగా మాట్లాడి.. వారితో ఫొటోలు దిగారు. అనంతరం ఓ సీనియర్ ఫొటోగ్రాఫర్ నుంచి పెద్ద స్టిల్ కెమెరాను తీసుకుని .. తనే స్వయంగా ఫొటో తీశారు. ఈ సందర్భంగా అవయవదానం చేసేందుకు అంగీకరించిన ఫొటోగ్రాఫర్లకు ముఖ్యమంత్రి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

ఫొటోగ్రాఫర్లను ఫొటో తీస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



క్లిక్.. క్లిక్..

ఫొటోగ్రాఫర్లను కెమెరాలో బంధించిన సీఎం

మాజీ సైనికులకు రక్షణ హస్తం

- 'ముదల్వరిన్ కాక్కుమ్ కరంగళ్' పథకం ప్రారంభం
- పరిశ్రమల స్థాపనకు 155 మందికి సీఎం ఉత్తర్వులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల కోసం 'ముదల్వరిన్ కాక్కుమ్ కరంగళ్' పేరుతో వినూత్న పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన ఆమోద ఉత్తర్వులను ఆయన అందజేశారు. మాతృభూమి కోసం ఎండనకా, వాననక దేశ సరిహద్దుల్లో భద్రతా విధుల్లో పాల్గొని ప్రజలంతా స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు దోహదపడటంలో కీలకపాత్రను పోషించి, సర్వీసు పూర్తి చేసుకున్న మాజీ సైనికుల జీవన పరిస్థితులు మెరుగుపరిచేందుకు, వారి పిల్లలకు ఉపకారవేతనాలు అందించేందుకు, విధి నిర్వహణలో అసువులు బాసిన సైనికుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగవకాశాల కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు గత యేడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మాజీ సైనికుల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు 'ముదల్వరిన్ కాక్కుమ్ కరంగళ్' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెడతానని సీఎం స్టాలిన్ ప్రకటించారు. సచివాలయంలో మంగళవారం ఉదయం ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 155 మంది మాజీ సైనికులకు పరిశ్రమల స్థాపనకు సంబంధించిన ఒప్పంద ఉత్తర్వులను అందజేశారు. వీరందరికీ 30 శాతం సబ్సిడీతో రూ.24.43 కోట్లను విడుదల చేయనున్నట్లు స్టాలిన్ తెలిపారు. ఈ పథకం కింద మాజీ సైనికులకు పలు రకాల పరిశ్రమలు నెలకొల్పేందుకు బ్యాంక్‌ల ద్వారా కోటి రూపాయల దాకా రుణ సదుపాయం కల్పించనున్నామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ఇచ్చే రుణంలో 30 శాతం మూలధన సబ్సిడీగా, 3 శాతం వడ్డీరూప సబ్సిడీగా అందిస్తామన్నారు. జిల్లాల వారీగా ఈ పథకం కోసం మాజీ సైనికులు సమర్పించే దరఖాస్తులను త్వరగా పరిశీలించి రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు. అంతేకాకుండా మాజీ సైనికులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు, ప్రతిభాపాటవాలను మెరుగుపరచేందుకు సునిశిత శిక్షణ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ కయల్‌విళి సెల్వరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రజాపనుల శాఖ కార్యదర్శి రీటా హరీష్ టక్కర్, ప్రత్యేక కార్యదర్శి, మాజీ సైనిక సంక్షేమ విభాగం సంచాలకుడు సజ్జన్‌సింగ్ ఆర్ చవాన్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికుడికి రుణ సదుపాయం అందిస్తున్న సీఎం ఎంకే స్టాలిన్

పీడబ్ల్యూడీలో 165 మంది నియామకం...

సచివాలయంలో ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో టీఎన్‌పీఎస్సీ పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన 165 మందికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నియామక ఉత్తర్వులను పంపిణీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులకు ఎంపికైన 165 మందికి ఆయన ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ మంత్రి ఈవీ వేలు, వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ప్రజాపనుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, ప్రజాపనుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్ మనివన్నన్ తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా వ్యవసాయశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రభుత్వ పరీక్షల విభాగం జరిపిన పరీక్షలలో ఉత్తీర్ణులైన 169 మందికి, కారుణ్య ప్రాతిపదికన 33 మంది వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందించారు.

హైవేస్‌లో 45 మందికి నియామకాలు...

హై వేస్ శాఖలో ఖాళీగా ఉన్న 45 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ప్రభుత్వ పరీక్ష విభాగం జరిపిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన 45 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు పంపిణీ చేశారు. 2021 నుంచి హైవేస్‌లో ఖాళీగా ఉన్న 1016 పోస్టులను భర్తీ చేశామని, తాజాగా 45 మంది ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశానని స్టాలిన్ అన్నారు.

అంబులెన్స్ సిబ్బందిపై అంత ఆగ్రహమెందుకు?

- ప్రాణాలను కాపాడేవారికి దారిస్తే తప్పేంటి?
- ఈపీఎస్‌పై మంత్రి సుబ్రమణ్యం ధ్వజం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులను ఆక్రమించుకుని రోడ్‌షోలు జరుపుతున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అంబులెన్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం గర్హనీయమని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. సైదాపేటలో మంగళవారం ఉదయం ఏర్పాటైన 'ఉంగలుడన్ స్టాలిన్' విజ్ఞప్తుల స్వీకరణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... సోమవారం రాత్రి ఎడప్పాడి పళనిస్వామి రోడ్‌షోలో రోగులు లేకుండా ఖాళీగా వెళుతున్న అంబులెన్స్ సిబ్బందిని దుర్భాషలాడటం భావ్యమేనా అని ప్రశ్నించారు. ప్రాణాలను కాపాడేందుకు వెళుతున్న అంబులెన్స్‌లు రోగితో వెళ్లినా, ఎవరినైనా రోగులను తరలించడానికి ఖాళీగా వెళ్లినా వాటికి దారి ఇవ్వడం బాధ్యత అనే విషయం కూడా ప్రతిపక్షనాయకుడికి తెలియకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1330కి పైగా అంబులెన్స్‌లు రోగులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి వారి ప్రాణాలను కాపాడుతున్నాయని చెప్పారు. రోగులతో వెళ్లే అంబులెన్స్‌లకే దారి ఇవ్వాలని, రోగులు లేని అంబులెన్స్‌లకు దారి ఇవ్వకూడదని ఈపీఎస్ కొత్త నియమాలను ప్రకటిస్తున్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈపీఎస్ జరిపే రోడ్‌షోలన్నీ అంబులెన్స్‌లు వెళ్లే ప్రధాన రహదారులలోనే జరుగుతున్నాయని, అలాంటప్పుడు తాను రోడ్‌షోలు జరిపే మార్గాలలోనే అంబులెన్స్‌లను పంపుతూ తన ప్రచారాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ డీఎంకేపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రోగుల ప్రాణాలను కాపాడే అంబులెన్స్ సిబ్బందిని ఈపీఎస్ తీవ్రంగా బెదిరిస్తూ మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. తన ప్రచార పర్యటనలకు అడ్డు కలిగించేలా ఖాళీగా అంబులెన్స్‌లను నడుపుకుంటే వెళితే, ఆ అంబులెన్స్‌లలోనే రోగులుగా వెళతారని హెచ్చరించడం కూడా గర్హనీయమన్నారు. ఇకనైనా అంబులెన్స్ సిబ్బందిని దూషించడం మానకపోతే ఈపీఎస్ తీవ్రపరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని మంత్రి సుబ్రమణ్యం హెచ్చరించారు.



సైదాపేటలో 'ఉంగలుడన్ స్టాలిన్' శిబిరంలో మంత్రి సుబ్రమణ్యం, మేయర్ ప్రియ తదితరులు

ఖాళీ అంబులెన్సులను పంపి ఇబ్బంది పెడతారా?

డీఎంకేపై ఈపీఎస్ ఆగ్రహం



ప్రచార సభలోకి వచ్చిన అంబులెన్స్

ప్రచార సభలకు అంతరాయం కల్పించేందుకు కుట్ర


ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రచారసభలోకి ఖాళీ అంబులెన్స్ రావడంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మక్కళై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' నినాదంతో గత నెల 7న ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్రలో భాగంగా సోమవారం రాత్రి వేలూరు సమీపంలోని అనైకట్టు ప్రాంతంలో ఈపీఎస్ రోడ్‌షో నిర్వహించారు. ఈపీఎస్ ప్రసంగిస్తున్న సమయంలో ఉన్నట్లుండి అక్కడకు ఖాళీ అంబులెన్స్ రావడంతో సభలో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. దీనిపై స్పందించిన ఈపీఎస్ ఇది డీఎంకే కుట్రేనని, తాను పాల్గొంటున్న ప్రచారసభల్లో ప్రజలు భారీసంఖ్యలో తరలివస్తుండటాన్ని చూసి ఓర్వలేక సభను భగ్నం చేసేందుకు ఇలా ఖాళీ అంబులెన్సును పంపించారని దుయ్యబట్టారు. సభలోకి దూసుకొచ్చిన వాహనం వల్ల ప్రజలకు గాయాలైతే తనపై నిందమోపవచ్చని, తాను ఇంతవరకు పాల్గొన్న 30 సభల్లో డీఎంకే నేతలు ఇలాంటి చేష్టలకు పాల్పడ్డారని, ఇలాంటి నీచ సంస్కృతికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. తాను పాల్గొనబోయే తదుపరి సభలో రోగిలేకుండా అంబులెన్స్ వస్తే ఆ డ్రైవరే అదే అంబులెన్స్‌లో రోగిగా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని ఈపీఎస్ వ్యాఖ్యానించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను గోల్డెన్ అవర్‌లోగా ఆస్పత్రులకు తరలించే అంబులెన్స్‌లకు దారివ్వాల్సిన బాధ్యత వాహన చోదకులదని, అయితే రోగిలేకుండా జనంలోకి అంబులెన్స్ రావడం మంచి పద్ధతి కాదన్నారు. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను ఎదుర్కొనే ధైర్యంలేకే అధికార పార్టీ కుయుక్తులు పన్నుతోందని, వీటికి తాము భయపడేదిలేదని ఈపీఎస్ తేల్చిచెప్పారు. ధరల పెంపును నియంత్రించలేని డీఎంకే ప్రభుత్వం ప్రతిపక్షాలకు పెరుగుతున్న ప్రజాదరణతో ఓటమి భయం పట్టుకుందన్నారు. దేశంలోనే ఉన్నత విద్యను చదువుకుంటున్న విద్యార్థులు అధికంగా ఉన్న రాష్ట్రంగా తమిళనాడును ముందుకు నడిపి చరిత్ర సృష్టించిన ఘనత అన్నాడీఎంకే ప్రభుత్వానిదేనని, అనైకట్టులో కొత్తగా రెండు ఆర్ట్స్ కళాశాలలను ప్రారంభించింది కూడా తామేనన్నారు. అదేవిధంగా అనైకట్టును కొత్త తాలూకాగా ప్రకటించడం, అగడంలో చెక్‌డ్యాం నిర్మించడం, అరియూర్‌లో రైల్వేవంతెన ఏర్పాటు చేసి వాహనాల రద్దీని తగ్గించామన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేసిన ఈపీఎస్ ఆయనకు ఓటేసి గెలిపించాలని డీఎంకే సహా అన్ని పార్టీలను కోరారు.

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎంపిక...

హమ్మయ్యా!

- హైకోర్టులో ఈపీఎస్‌కు ఊరట
- సివిల్ కోర్టు ఉత్తర్వులపై 'స్టే'

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చాలని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సమర్పించిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ నగరంలో సివిల్‌కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. 2022 జూలై 11న జరిగిన అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో ఈపీఎస్ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికను సవాల్ చేస్తూ, ఆ సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానాలను వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే సభ్యుడిగా ప్రకటించుకున్న దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి నగరంలోని సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పార్టీ ప్రాథమిక సభ్యులంతా కలిసి ఎన్నుకోవాల్సి ఉండగా ఈపీఎస్ ఆ విధంగా ఎన్నికకాలేదంటూ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ నేపథ్యంలో పార్టీ నియమ నిబంధనల ప్రకారమే తాను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యానని కనుక సూర్యమూర్తి పిటిషన్‌ను తోసిపుచ్చాలని ఈపీఎస్ పిటిషన్ సమర్పించారు. ఆ పిటిషన్‌ను జూలైలో సివిల్ కోర్టు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు వెలువరించింది. ఈ పరిస్థితుల్లో సివిల్ కోర్టు వెలువరించిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈపీఎస్ తరఫున మద్రాసు హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ న్యాయమూర్తి పీపీ బాలాజీ ఎదుట మంగళవారం ఉదయం విచారణకు వచ్చింది. ఈపీఎస్ తరఫున సీనియర్ న్యాయవాది విజయ్‌నారాయణ్, న్యాయవాది నర్మదా సంపత్ వాదనలు వినిపిస్తూ.. సివిల్‌కోర్టులో ఈపీఎస్ ఎంపికను సవాలు చేస్తూ పిటిషన్ వేసిన సూర్యమూర్తి అన్నాడీఎంకే సభ్యుడే కాదని, అతడికి పార్టీ వ్యవహారాలను ప్రశ్నించే అధికారమే లేదని పేర్కొన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఈపీఎస్ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ సివిల్‌కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు. సివిల్‌కోర్టులో పిటిషన్ వేసిన సూర్యమూర్తి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 3వ తేదీకి వాయిదా వేశారు.



ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తగ్గిన నీట్ కటాఫ్ మార్కులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చేరడానికి సంబంధించిన నీట్ కటాఫ్ మార్కులు గత యేడాది కంటే ఈ యేడాది 100 మార్కుల దాకా తగ్గాయి. ఎంబీబీఎస్ మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసిన తరువాత వైద్య ఆలోచన మండలి జారీ చేసిన ప్రకటనలో ఈ విషయం వెల్లడైంది. ఈ యేడాది వైద్య కోర్సులలో చేరేందుకు విద్యార్థుల మధ్య పోటీ అధికం కావటంతో చాలా విభాగాల్లో ఆలిండియా ర్యాంకులు తగ్గాయి. ఉదాహరణకు జనరల్ కేటగిరీలో 12,262వ స్థానం పొందిన విద్యార్థి వైద్యకళాశాలలో సీటును పొందాడు. అయితే గత యేడాది 13,671వ స్థానం వరకే అడ్మిషన్లు లభించాయి. జనరల్ కేటగిరీలో ఈ యేడాది 538 మార్కులు పొందిన విద్యార్థినికి సీటు లభించింది. అదే గతయేడాది 651 మార్కులు పొందిన వారికే సీట్లు లభించాయి. అయితే జనరల్ కేటగిరీ ర్యాంక్ ప్రస్తుతం 1308తోనే ముగిసింది. గత యేడాది 1346తో ముగిసింది. ఈ యేడాది ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, ఎస్టీ విభాగాల్లో కటాఫ్ మార్కు అధికమైంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 2180వ స్థానం వరకు సీట్లు లభించాయి. ఈ యేడాది 25,599 వరకు సీట్లు లభించాయి.

రామేశ్వరం జాలర్ల రైల్ రోకో

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలను విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు మంగళవారం రైల్‌రోకో చేపట్టారు. నిషేధకాలం ముగిసిన అనంతరం రాష్ట్ర జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నారు. కచ్చాదీవి సమీపంలో చేపలు పట్టుకునే వారిని చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటి అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారంటూ అరెస్ట్ చేయడంతో పాటు వారి పడవలు స్వాధీనం చేసుకుంది. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలిస్తున్నారు. రెండు నెలల్లో సుమారు 50 మందికి పైగా జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి 100కు పైగా పడవలను స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో, శ్రీలంక నావికాదళం అమానుష దాడులు అరికట్టేలా చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాయి. కానీ, శ్రీలంక నావికాదళం దాడులు కొనసాగుతుండడంతో రామేశ్వరం జాలర్లు తమకు భద్రత కల్పించాలని, శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లను విడిపించాలని, లంక నావికాదళం స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించాలన్న డిమాండ్లతో ఏడు రోజులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో, మంగళవారం రైల్‌రోకోకు పిలుపునిచ్చిన జాలర్ల సంఘాలు, కుటుంబాలతో రామేశ్వర తంగచ్చిమఠంలో రైలు పట్టాలపై బైఠాయించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో, రామేశ్వరం నుంచి తాంబరం బయల్దేరాల్సిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రామేశ్వరంలో నిలిపివేశారు. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు అక్కడకు చేరుకుని జాలర్ల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపడంతో జాలర్లు రైల్ రోకో విరమించి వెనుదిరిగారు. అనంతరం తాంబరం రైలు, ప్యాసింజర్ రైలు ఒకదాని తర్వాత మరొకటి బయల్దేరి వెళ్లాయి.



పట్టాలపై బైఠాయించిన జాలర్లు

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అడయార్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక రెడ్‌హిల్స్ పరిధిలోని దర్గాస్ రోడ్డు, శ్రీ బాలవినాయకర్ నగర్, కన్నం పాళయం, గోమతిఅమ్మన్ నగర్, సెన్రంబాక్కం, సిరంగవూర్, మల్లిమానగర్, అన్బు నగర్, దురై షెడ్, అళింజివాక్కం, న్యూ స్టార్ సిటీ, కల్లికుప్పం తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు చెన్నైలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 21న గురువారం జరగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' పథకం శిబిరాల వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ విడుదల చేసింది. ఆ ప్రకారం, 1వ మండలం పరిధిలో తిరువొత్తియూర్ పొన్నితోట్టమ్ క్రీడా మైదానం, 4వ మండలం పరిధిలో పాత వాషరమెన్‌పేట మింట్ సుబ్బరాయన్ వీధిలోని నాపా కల్యాణ మండపం, 5 మండలం పరిధిలో సైడన్‌హోమ్స్ రోడ్డులోని చెన్నై కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, 7వ మండల పరిధిలో అంబత్తూర్ రెడ్‌హిల్స్ రోడ్డు సమీపంలోని పీటీఆర్ చెల్లయ్య చెట్టియార్ కల్యాణ మండపం, 9వ మండలం పరిధిలో టి.నగర్ మెలోని నగర్‌లోని మనోరమ ఆచ్చి స్కూలు, 10వ మండలం పరిధిలో రాయపేట జానిజహాన్‌ఖాన్ రోడ్డులోని ప్రజెంటేషన్ చర్చి కమ్యూనిటీ హాలులో ప్రత్యేక శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 12వ మండల పరిధిలో వానువంపేట పాలాండిఅమ్మన్ ఆలయ వీధిలోని పాలండిఅమ్మన్ కల్యాణ మండపం, 13వ మండలం పరిధిలోని వేళచ్చేరి టీఎన్‌హెచ్‌బీ అవెన్యూలోని అమ్మ మండపం, 14వ మండలం పరిధిలో పల్లికరనై వేళచ్చేరి రోడ్డులోని ఐశ్వర్య కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరాలు జరుగుతాయని జీసీసీ తెలిపింది.

నేటినుంచి జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 20న బుధవారం చెన్నైలోప్రారంభం కానున్నాయి. తమిళనాడు అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో 64వ జాతీయ సీనియర్ అథ్లెటిక్ పోటీలు స్థానిక పెరియమేడులోని నెహ్రూ క్రీడా మైదానంలో ఈనెల 24వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో 35 జట్లకు చెందిన సుమారు 600 మంది పురుష, మహిళా అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తారు.

ముంబై విమానాల రద్దు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముంబైలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా చెన్నై నుంచి అక్కడికి వెళ్లే విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ముంబైలో కనీవినీ ఎరుగని రీతిలో మంగళవారం భారీగా వర్షాలు కురిశాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించని కారణంగా ముంబై-చెన్నై మధ్య నాలుగు విమాన సర్వీసులను రద్దు చేయడంతో ఆ విమానాల్లో ప్రయాణించేందుకు టిక్కెట్లు రిజర్వు చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు.

రూ.437 కోట్లతో టెక్స్‌టైల్ పార్క్‌లో మౌలిక సదుపాయాలు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో టెక్స్‌టైల్ పార్క్‌లో మౌలిక సదుపాయాలకు రూ.437 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. విరుదునగర్ జిల్లా కుమరలింగపురంలో సుమారు 1,052 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన మంత్రి గ్రాండ్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు 2023లో పార్లమెంటులో ప్రకటించారు. కొన్ని నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో, సిప్కాట్ తరఫున 1,052 ఎకరాల భూసేకరణ చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.2,000 కోట్లు కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేయనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1,894 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో, పార్క్ ఏర్పాటుకు తొలిదశలో మురుగునీటి కాలువలు, నీటి సరఫరా, వర్షపు నీటి పారుదల కాలువలు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను చేపట్టనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, ఈ పనులకు టెండర్లు ఆహ్వానించింది.

నేటి నుంచి పళని రోప్‌కార్ సేవలు ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పళని రోప్ కార్ సేవలు ఈనెల 20న బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పళని మురుగన్ కొండ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు వించ్, రోప్ కార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, రోప్ కార్ మార్గాల్లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా గత నెల 15వ తేది నుంచి సేవలు నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో బుధవారం ఉదయం 9 గంటల నుంచి రోప్ కార్ సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు.

కోయంబేడు-పట్టాభిరాం మెట్రోకు రూ.2,442 కోట్లు కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు - పట్టాభిరాం వరకు మెట్రో రైలు మార్గం రూ.9,228 కోట్లతో 21.7 కి.మీ దూరం ఏర్పాటుకానుంది. 19 మెట్రో రైల్వేస్టేషన్లు, మూడు ఫ్లైఓవర్లతో ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇదివరకే అంగీకారం తెలిపిన నేపథ్యంలో, రైలు మార్గం ఏర్పాటుకు సంబంధించి రూ.2,442 కోట్లతో భూ సేకరణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

ఒకే సమయంలో రెండు కోర్సులు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం సిఫారసుల మేరకు, మద్రాసు విశ్వవిద్యాలయం ప్రస్తుతం విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సుల విద్యార్థులు ఒకే సారి రెండు డిగ్రీ కోర్సులు అభ్యసించేందుకు అనుమతించాలని నిర్ణయించారు. దూరవిద్య చదువుతున్న విద్యార్థులకు తొలివిడతగా ఈ విధానం అమలుచేయనున్నారు. రెండు కోర్సుల అడ్మిషన్లకు మార్గదర్శకాలు రూపొందించే పనులను దూరవిద్య సంస్థకు అప్పగించారు. కామర్స్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులు వారి నైపుణ్యం అభివృద్ధి చేసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని ప్రొఫెసర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టీఆర్ బాలుకు సతీ వియోగం




చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కోశాధికారి, ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు టీఆర్ బాలు సతీమణి రేణుకాదేవి(80) మంగళవారం ఉదయం కన్నుమూశారు. శ్వాసకోశ సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురై కొద్ది నెలలుగా ఆమె నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చికిత్స ఫలించక ఆమె తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సతీమణి దుర్గాస్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి తదితరులు టీఆర్ బాలు నివాసగృహానికి వెళ్లి రేణుకాదేవి భౌతికకాయానికి నివాళులర్పిం చారు. టీఆర్ బాలు, ఆయన తనయుడు, మంత్రి టీఆర్‌బీ రాజాను ఓదార్చారు.

టీఆర్ బాలు సతీమణి రేణుకాదేవి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, సతీమణి దుర్గా స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు

71వ పడిలోకి భవానీసాగర్ డ్యాం

● సంబరాలు జరుపుకున్న రైతులు



భవానీసాగర్ డ్యాం

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భవానీ సాగర్ డ్యాం మంగళవారం 71యేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఈరోడ్, తిరుప్పూర్, కరూర్ జిల్లాలకు చెందిన రైతులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో డెల్టా జిల్లాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తున్న మేట్టూరు డ్యాం తర్వాత దక్షిణ తమిళనాడులో అతిపెద్ద డ్యాంగా రైతులకు భవానీ సాగర్ డ్యాం అండగా ఉంది. 1948వ సంవత్సరం డ్యాం పనులను ప్రారంభించి 1955వ సంవత్సరం పూర్తి చేశారు. అదే సంవత్సరం ఆగస్టు 19న అప్పటి ముఖ్యమంత్రి కామరాజర్ ఈ డ్యాంను ప్రారంభించారు. డ్యాంలో 21 గేట్లు ఎత్తి ఈరోడ్, తిరుప్పూర్, కరూర్ జిల్లాల్లోని భూములకు సాగునీరు విడుదల చేశారు. 105 అడుగుల సామర్థ్యం కలిగిన భవానీసాగర్ డ్యాం ద్వారా ఈ మూడు జిల్లాల్లో సుమారు 2.47 లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. మరోవైపు డ్యాం నుంచి 20మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. కీల్ భవానీ సాగు కాలువలో నిల్వచేస్తున్న నీటి ద్వారా మరో 8 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 1955 నుంచి ఇప్పటివరకు 23సార్లు ఈ డ్యాం పూర్తిస్థాయిలో నిండింది.

తిరుచెందూర్‌లో వైభవంగా ఆవణి వేడుకలు

● నేత్రపర్వంగా వళ్లీ, దేవసేన సమేత స్కందుడి పురవిహారం



స్వామివారి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆవణి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో సుబ్రహ్మణ్యస్వామి కొలువుదీని ఆరు ప్రధాన పుణ్యక్షేత్రాల్లో రెండోదైన తిరుచెందూర్‌లో ఈ నెల 14న ధ్వజారోహణం పూజలతో ఆవణి మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు వళ్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను ఉదయం, సాయంత్ర వేళల్లో పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. ఐదో రోజైన సోమవారం ఉదయం 6.15 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, దీపారాధన, సాయంత్రం 4 గంటలకు లక్ష దీపారాధన, రాత్రి 7గంటలకు శివకొలుగీశ్వరర్ ఆలయం తరుపున స్వర్ణ మయూర వాహనంలో స్వామి వారి ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామున 5 నుండి 5.30 గంటలలోపు విశ్వరూప దీపారాధనను ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథవీధి మండప ప్రవేశద్వారం వద్ద వెండి చప్పరంపై స్వామివార్లను కొలువుదీర్చి జయంతినాథర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె వాయిదా



సమ్మెలో నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ పనుల నిమిత్తం 'అవర్ ల్యాండ్'తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రారంభించిన నిరవధిక సమ్మెపై చర్చలకు ఆహ్వానించడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పారిశుధ్య కార్మికుల సంఘం ప్రకటించింది. కార్పొరేషన్, మున్సిపాలిటీ, టౌన్ పంచాయతీల్లో చెత్త సేకరణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే జీవో 152, 139లను రద్దుచేయాలి, ఆరోగ్య విభాగం, ఇంజనీరింగ్ కళాశాలల పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం జీవో 62 (31) ప్రకారం నెలకు రూ.26వేలు నిర్ణయించాలి, అన్ని విభాగ ఉద్యోగులకు దీపావళి పండుగ సందర్భంగా నెల వేతనం పంపిణీ చేయాలన్న డిమాండ్లతో పాటు పదమూడు రోజులు నిరవధిక సమ్మెలో పాల్గొన్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తాత్కాలిక పారిశుధ్య కార్మికుల కోరికలను పరిష్కరింపజేయాలని డిమాండ్ చేస్తూ మదురై కార్పొరేషన్ ఉద్యోగులు పారిశుధ్య కార్మికులు కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణాల్లో మంగళవారం వరకు సమ్మెలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, కార్మికుల సంఘ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యంను కార్పొరేషన్ యాజమాన్యం చర్చలకు ఆహ్వానించడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. చర్చల్లో తమకు న్యాయం జరగకుంటే మళ్ళీ సమ్మెలో పాల్గొంటామని కార్మికులు తేల్చి చెప్పారు.

మేలటూరులో వినాయక చవితి వేడుకలు ప్రారంభం

● 24న తిరుకల్యాణం



ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పాపనాశం తాలూకా మేలటూరులో ప్రసిద్ధి చెందిన సిద్ధి, బుద్ధి సమేత దక్షిణామూర్తి వినాయకుడి ఆలయంలో చవితి వేడుకలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 108 గణపతి క్షేత్రాల్లో 81వ క్షేత్రమైన మేలటూరులో పదిరోజులు పాటు గణేశ చతుర్థి వేడుకలు నిర్వహించనున్నారు. 21న గణేశ్ మహరాజ్ ఊరేగింపు, 24 సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరుడి తిరుకల్యాణం జరగనుంది. ఈ వైభవ సందర్భం, వివాహం కానీ యువతీ,యువకులు స్వామివారిని దర్శించుకుని చేతికి కంకణం కట్టుకుంటే వారి కోరిక నెరవేరుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మంత్రి పెరియస్వామికి ఈడీ సమన్లు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి పెరియస్వామికి సమన్లు అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పెరియస్వామి వ్యవహరిస్తున్న పెరియస్వామి 2006- 11 మధ్య మంత్రిగా ఉన్న సమయంలో ఆదాయానికి మించి రూ.2,01,35,000 అధికంగా ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదుచేశారు. ఈ కేసు ఆధారంగా చట్టవ్యతిరేక నగదు బదిలీ చట్టం కింద మంత్రి పెరియస్వామిపై ఈడీ కేసు నమోదుచేసింది. ఈ క్రమంలో, చెన్నై, దిండుగల్‌లోని మంత్రి పెరియస్వామి, ఆయన కుమారుడు, ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్, మరో కుమారుడు ప్రభు, కుమార్తె ఇంద్రాణి తదితరుల ఇళ్లలో ఈడీ అధికారులు ఈ నెల 16వ తేది తనిఖీలు చేపట్టారు. మంత్రి పెరియస్వామి కుమారుడు ఐపీ సెంథిల్ కుమార్, కుమార్తె ఇంద్రాణి ఇళ్ల నుంచి, మంత్రి పెరియస్వామి, చిన్న కుమారుడు ప్రభు డైరెక్టర్లుగా ఉన్న 'ఇరులప్ప మిల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయం నుంచి ఆస్తులు, పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఈ సంస్థ ప్రాంగణంలో కొన్ని పేపరు కంపెనీలు పనిచేస్తున్నాయని, ఆ కంపెనీ ఖాతాలు, స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికాలను పరిశీలిస్తున్నామని తెలిపింది. కాగా, స్వాధీనం చేసుకున్న పత్రాలు, పరికరాల గురించి వివరాలు సేకరించేలా మంత్రి పెరియస్వామికి సమన్లు జారీ చేయాలని ఈడీ నిర్ణయించింది.

ఉగ్రవాదుల సంచారం?

● తేని, దిండుగల్‌లో ముమ్మర తనిఖీలు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ వరుస పేలుళ్ల ఉగ్రవాదుల కదలికలు తెలుసుకోవడానికి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ తేని, దిండుగల్ జిల్లాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తోంది. ఇటీవల ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో తలదాచుకున్న కోవై బాంబు పేలుళ్ల ఉగ్రవాదులు మహ్మద్‌అలీ, అబూబకర్ సిద్ధిఖ్, టైలర్ రాజా తదితరులను తమిళనాడు ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పోలీసు కస్టడీలోకి తీసుకుని చేపట్టిన విచారణలో... వారు అజ్ఞాతంలో ఉన్న కాలంలో బాంబు తయారీతో పాటు పలురకాల శిక్షణ పొందారని తెలిసింది. కోవైలో వరుస బాంబు పేలుళ్లు, హిందూ సంస్థ నాయకుల హత్యకు సంబంధించి మహ్మద్ అలీ, సిద్ధిఖ్‌తో పాటు మరో 8 మంది ఈ గ్రూపులో ఉన్నట్లు విచారణలో తెలిసినట్లు సమాచారం. తాజాగా, పరారీలో ఉన్న ఉగ్రవాదులు కోవై పోతనూరుకు చెందిన ముజిబుల్ రెహ్మాన్, వాణియంబాడికి చెందిన ముస్తాక్ అహ్మద్, కోవై కునియాముత్తూర్‌కు చెందిన అష్రఫ్ అలీ సహా 8 మంది కోసం ఏటీఎస్ బృందాలు గాలిస్తున్నాయి. ఈ క్రమంలో, తేని, దిండుగల్ జిల్లాల్లో వారి సంచారం ఉన్నట్లు తెలుసుకున్న ఏటీఎస్ బృందాలు, ఆ జిల్లాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాయి.

రాధాకృష్ణన్‌కు ఓటేయం : సీపీఎం

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతుగా తమ పార్టీ ఎంపీలు ఓటు వేయరని సీపీఎం తెలిపింది. ఈ మేరకు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో... ఆయన బీజేపీ అభ్యర్థి అని, ఆయన ఎన్నిక వల్ల తమిళనాడుకు ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. ఆయన తమిళనాడుకు చెందిన వారు కావడంతో తాము ఆదరించాల్సి అవసరం లేదన్నారు. ఆయనకు ఎలాంటి అధికారాలు ఉండవని, అందువల్ల తమిళనాడు అభివృద్ధికి ఆయన ఎలాంటి చర్యలు చేపట్టలేరని సీపీఎం ప్రకటనలో తెలిపింది.

రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు నిధుల కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు రూ.1,137.97 కోట్ల నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2023 జూలై నుంచి 2024 ఏప్రిల్ వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పదవీ విరమణ రాయితీలు అందించేలా ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని సచివాలయం తెలిపింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు వెంటనే పదవీవిరమణ ఫలాలు అందించాలని కార్మిక సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు శ్రమించాలని ఏఐసీసీ రాష్ట్ర ప్రతినిధి గిరీష్ చోడంగర్ పిలుపునిచ్చారు. స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు ఎస్.సత్యమూర్తి 138వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యమూర్తి చిత్రపటానికి గిరీష్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సీనియర్ నేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో గిరీష్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి? రానున్న శాసనసభ ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న స్థానాలు? కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్ , సహా పలు అంశాలపై ఆయన చర్చించారు.

రోగుల అవయవాల విక్రయం అత్యంత దారుణం

హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల అవయవాల విక్రయం అత్యంత దారుణమని, ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. నామక్కల్ జిల్లా పల్లైపాళయం, కుమారపాళయం పరిసరాల్లో నివసిస్తున్న నేత కార్మికుల పేదరికాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో కిడ్నీల విక్రయం పేరుతో దళారులు మోసం చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వ ఆరోగ్య శాఖకు ఫిర్యాదులందాయి. వీటిపై విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఈరోడ్, తిరుచ్చి సహా పలు జిల్లాల్లోని ప్రైవేటు ఆస్పత్రులలో ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తిరుచ్చిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీల్లో కిడ్నీ దానంచేసిన నామక్కల్ జిల్లాకు చెందిన వ్యక్తుల వివరాలను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నీ విక్రయాల వ్యవహారాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. దాన్ని పరిశీలించిన న్యాయమూర్తుల బెంచ్ చికిత్సకోసం ఆస్పత్రిలో చేరే రోగుల అవయవాలను విక్రయించడం దారుణమని, ఇది చట్టవిరుద్ధమన్నారు. కిడ్నీ విక్రయాల వ్యవహారంలో ఇప్పటికి వరకు తగిన చర్యలు ఎందుకు తీసుకోలేదని బెంచ్ ఆరోగ్య, పోలీస్ శాఖ అధికారులను సూటిగా ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాల నివేదికను దాఖలు చేయాల్సిందిగా ఆరోగ్యశాఖ కార్యదర్శికి హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

కుమారుడు, కుమార్తెను హతమార్చి తండ్రి ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుమారుడు, కుమార్తెను హతమార్చిన తండ్రి, తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడలూరు జిల్లా బన్రూట్టికి చెందిన రాజా (40)కు 12 ఏళ్ల కుమారుడు, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా భర్త, పిల్లలను వదిలి రాజా భార్య వెళ్లిపోయింది. దీంతో, అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్న రాజా, జీవితంపై విరక్తి చెందాడు. తాను లేకపోతే తన పిల్లలు అనాథలవుతారని భావించాడు. సోమవారం రాత్రి కుమారుడు, కుమార్తెను ఉరేసి హతమార్చిన రాజా, తాను కూడా ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికలు ముఖ్యమంత్రి నిర్ణయమే నా నిర్ణయం

● ఎంపీ కమలహాసన్

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ముఖ్యమంత్రి నిర్ణయమే తన నిర్ణయమని రాజ్యసభ ఎంపీ కమలహాసన్ అన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9వ తేదీ జరుగనున్న నేపథ్యంలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్, రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే, కాంగ్రెస్ నేతృత్వంలో 'ఇండియా' కూటమి తరఫున తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి పోటీచేయనున్నారు. ఈ క్రమంలో, ఢిల్లీ నుంచి మంగళవారం నగరానికి చేరుకున్న ఎంపీ కమల్‌ను విమానాశ్రయంలో విలేకరులు ఉప రాష్ట్రపతి ఎన్నికపై ప్రస్తావించగా, ఎన్నికపై ముఖ్యమంత్రి నిర్ణయమే తన నిర్ణయమని తెలిపారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న 'రీల్స్' వ్యామోహం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'రీల్స్' వ్యామోహం ఇద్దరు ప్రాణాలు బలిగొంది. స్థానిక జమీన్ పల్లావరంకు చెందిన ఏసీ మెకానిక్ అబ్దుల్ అహ్మద్ (17) తన సోదరుడి ద్విచక్రవాహనంలో, స్నేహితుడు సుహైల్ అహ్మద్ (15)తో కలసి పల్లావరం సంత రోడ్డు అతివేగంగా వెళుతూ రీల్స్ తీస్తున్నాడు. అంతలో ఎదురుగా ముగ్గురు వస్తున్న బైక్ అబ్దుల్ అహ్మద్ బైక్‌ను ఢీకొనింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. సుహైల్ అహ్మద్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను తాంబరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో... మరో బైక్‌లో వస్తున్న వారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ముఖర్జీ, అంకిత్‌రాజన్, ఢిల్లీకి చెందిన అరుణ్ శర్మ (20) అని, విమానాశ్రయం సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది. కాగా, ఆస్పత్రిలో చికిత్సలు ఫలించక అరుణ్‌శర్మ మృతి చెందాడు.

రూ.62.82 కోట్లతో కాలువల పూడికతీత పనులు



తిరుత్తణి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో పూడిక తీత పనులు చివరి దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2018లో పొన్నేరి శివారు ప్రాంతాల్లోని పంటకాలువలు, మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులకు రాష్ట్రప్రభుత్వం రూ.62.82 కోట్లను కేటాయించింది. ఈ నేపథ్యంలో, గ్రామాల్లోని మురుగునీటి కాలువల పనుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ల వల్ల తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినే అవకాశముందని గ్రామస్తులు ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో గత మూడు నెలల క్రితం నిలిపివేసిన ఈ పనులు నగర ఉన్నతాధికారుల చొరవతో ప్రారంభమయ్యాయి. గ్రామస్తులతో చర్చించిన అధికారులు ఇబ్బంది లేకుండా పైప్‌లైన్ నిర్మాణాలు చేపడుతామన్న హామీతో తిరిగి పనులు వేగం పుంజుకున్నాయి.

సీఎం ఆశీస్సులు పొందిన 'టైమ్‌లెస్' బృందం

అడయార్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అందాలను వివరిస్తూ 'టైమ్‌లెస్ తమిళనాడు' అనే పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రానికి జాతీయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆ చిత్ర బృందం మంగళవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ఆశీస్సులు పొందింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 71వ జాతీయ అవార్డులను ప్రకటించిన విషయం తెల్సిందే. సీఎంను కలుసుకున్న వారిలో చిత్రం సభ్యులతోపాటు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, సాంస్కృతిక, దేవాదాయ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి మణివాసన్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్, పర్యాటక శాఖ డైరెక్టర్ క్రిస్తురాజ్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ కవిత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తిరువళ్లువర్ వర్శిటీ 20వ స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

వేలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేర్కాడులోని తిరువళ్లువర్ యూనివర్శిటీ 20వ స్నాతకోత్సవం మంగళవారం జరిగింది. ఈ వర్శిటీ పరిధిలోని వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై తదితర జిల్లాల్లో 83 ఆర్ట్స్ కళాశాలలు పనిచేస్తున్నాయి. స్నాతకోత్సవ వేడుకలకు వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆర్ముగం అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ సెంథిల్ వేల్‌మురుగన్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్, వర్శిటీ ఛాన్సలర్ ఆర్ఎన్ రవి, గౌరవ అతిథిగా బెంగళూరు రామయ్య సైన్స్ కళాశాల వీసీ గుల్‌దీప్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 256 మంది విద్యార్థులకు గవర్నర్ ఆర్ఎన్ రవి డిగ్రీలు ప్రదానం చేశారు.

జీఎస్టీ తగ్గించాలి

● ఈపీఎస్‌కు వ్యాపారుల సంఘం వినతి



పళనిస్వామికి వినతి పత్రం అందజేస్తున్న వ్యాపారుల సంఘం ప్రతినిధులు

వేలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించేలా కేంద్రప్రభుత్వంతో మాట్లాడాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి జిల్లా వ్యాపారుల సంఘం వినతి పత్రం సమర్పించింది. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' పేరుతో పళనిస్వామి చేపట్టిన ప్రచారం మంగళవారం వేలూరు జిల్లాలో జరిగింది. మధ్యాహ్నం స్థానిక హోటల్‌లో బసచేసిన పళనిస్వామిని జిల్లా వ్యాపారుల సంఘం అధ్యక్షుడు జ్ఞానవేల్ కలుసుకుని వినతిపత్రం అందజేశారు. అలాగే, రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మణి వినతిపత్రం సమర్పించారు. అన్నాడీఎంకే అధికారం చేపట్టిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పళనిస్వామి హామి ఇచ్చినట్లు మణి తెలిపారు.

ఘనంగా జీకే మూపనార్ జయంతి



పేదలకు సహాయాలు అందజేస్తున్న టీఎంసీ మాజీ కౌన్సిలర్ రాణికృష్ణన్, జీఆర్ వెంకటేష్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) వ్యవస్థాపకుడు జీకే మూపనార్ 94వ జయంతిని మంగళవారం ఆ పార్టీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆళ్వార్‌పేటలో ఉన్న టీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోపనార్ చిత్రపటానికి పూలు చల్లి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మోపనార్, ప్రధాన కార్యదర్శులు వీబీ జవహర్‌బాబు, జీఆర్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ రాణికృష్ణన్ తదితరులు పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. అదేవిధంగా టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తన నివాసంలో మూపనార్ చిత్రపాటానికి నివాళులర్పించారు.

చిత్రజ్యోతి

లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో
అరుదైన కాంబో?



కమలహాసన్, లోకేష్ కనకరాజ్, రజనీకాంత్

కోలీవుడ్ వర్గాల్లో గత కొద్ది రోజులుగా ఓ వార్త చక్కర్లు కొడుతోంది. యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో అగ్రహీరోలు సూపర్‌స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమలహాసన్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకోనున్నట్టు ప్రచారం సాగుతోంది. గతంలో కమల్ - లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో 'విక్రమ్' చిత్రం వచ్చింది. ఇపుడు రజనీకాంత్ - లోకేష్ కాంబోలో 'కూలీ' సినిమా విడుదలైంది. ఈ రెండు చిత్రాలు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. దీంతో రజనీ - కమల్‌తో లోకేష్ ఓ చిత్రాన్ని ప్లాన్ చేశారని, ఈ చిత్రాన్ని కమల్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్నారనీ, ఇందుకోసం 'ఖైదీ-2' చిత్రం షూటింగును కూడా లోకేష్ వాయిదా వేశారనే ప్రచారం సాగుతోంది.

ముగ్గురు సీఎంలను అందించిన
'కేబీఎస్' కనుమరుగు



కేబీఎస్ థియేటర్ (ఫైల్‌ఫొటో)



కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత, సుందరాంబాళ్ (ఫైల్‌ఫొటో)

రాష్ట్రానికి ముగ్గురు ముఖ్యమంత్రులను అందించిన కేబీఎస్ థియేటర్ కనుమరుగైంది. ఈరోడ్ జిల్లా కొడుముడిలోని కేబీఎస్ (కేబీ సుందరాంబాళ్) సినిమా థియేటర్‌ను అలనాటి నటి, ప్రముఖ సినీ నేపథ్యగాయని కేబీ సుందరాంబాళ్ నిర్మించగా, నాటి రాజకీయ ఉద్ధండులు కరుణానిధి, ఎంజీ రామచంద్రన్ కలిసి ప్రారంభించారు. జయలలిత జ్యోతి ప్రజ్వలన చేశారు. సుందరాంబాళ్ తదనాంతరం ఆమె బంధువు డి.శక్తి గణేష్ పర్యవేక్షణలో కొంతకాలం నడిచింది. ఈ విషయంపై శక్తి గణేష్ మాట్లాడుతూ... 'కొడుముడిలో నిర్మించిన తొలి థియేటర్ ఇది. ఈ థియేటర్ రాకముందు ఈ ప్రాంతవాసులు 30-40 కిలోమీటర్ల దూరంలో ఉండే జిల్లా కేంద్రానికి వెళ్లి సినిమాలు చూసేవారు. ఈ థియేటర్‌ను 1969 అక్టోబరు 28న అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కరుణానిధి ప్రారంభించారు. ఈ వేడుకలో ఎంజీఆర్, జయలలిత కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత కాలక్రమంలో వీరిద్దరూ కూడా రాష్ట్ర ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇందులో 'తునైవన్' అనే చిత్రాన్ని తొలిసారి ప్రదర్శించారు. దేవర్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రాన్ని ఏవీఎం రాజన్, షావుకారు జానకి ప్రధాన పాత్రల్లో నటించగా, సుందరాంబాళ్ కూడా మరో ప్రధాన పాత్రను పోషించారు. 1980లో సుందరాంబాళ్ కన్నుమూయగా, ఆ తర్వాత థియేటర్ నిర్వహణ బాధ్యతలు బంధువులు చేపట్టారు. 2020 కోవిడ్ మహమ్మారి సమయం వరకు ఈ థియేటర్ కొనసాగుతూ వచ్చింది. ఆ తర్వాత కొంతకాలం పాటు మూసివేయగా, ఇపుడు థియేటర్‌ను కూల్చివేశారు.



కోలీవుడ్‌ను ఊపనున్న కేతిక శర్మ!

ఇప్పటికే తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక క్రేజ్‌ను సొంతం చేసుకున్న హీరోయిన్ కేతిక శర్మ... కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. దర్శకుడు రాజేష్ ఎం రూపొందించే చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు సమాచారం. అలాగే, కార్తిక్ నటించే కొత్త చిత్రంలో హీరోయిన్‌గా ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు కాకుండా, మరో రెండు మూడు సినీ అవకాశాలు ఆమెను వరించనున్నాయి. అదేసమయంలో మరో చిత్రంలో ప్రత్యేక గీతంలో నర్తించేందుకు ఆమె సమ్మతం తెలిపినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇలా వరుస చిత్రాల్లో నటించనున్న కేతిక శర్మ కోలీవుడ్‌లో ఓ ఊపు ఊపేందుకు సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. కాగా, తెలుగు, హిందీ భాషల్లో ఆమె నటించిన చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయానికి నోచుకోలేదు.



'దండకారణ్యం'లో కలైయరసన్, దినేష్

19న 'దండకారణ్యం' రిలీజ్

కలైయరసన్, దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన 'దండకారణ్యం' సెప్టెంబరు 19వ తేదీన విడుదల చేయనున్నట్టు దర్శక, నిర్మాతలు తాజాగా వెల్లడించారు. 'ఇరండామ్ ఉలగపోరిన్ కడైసి గుండు' సినిమా తర్వాత అదియన్ ఆదిరై దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాజెక్టు తుదిదశ చిత్రీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ తన సొంత బ్యానర్ నీలం ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కించిన ఈ చిత్రానికి ఎడిటింగ్ సెల్వ ఆర్‌కే, కెమెరా గౌరీరాజా, సంగీతం జస్టిన్ ప్రభాకరన్. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభించనున్నట్టు చిత్ర నిర్మాత పా.రంజిత్ తెలిపారు. ఈ సినిమా తర్వాత జీవీ ప్రకాష్ హీరోగా ఒక చిత్రం, తన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో మరో చిత్రం రూపొందించనున్నట్టు తెలిపారు.

రామ్‌కో సిమెంట్ నుంచి 'హార్డ్ వర్కర్'



మీడియా సమావేశంలో సంస్థ నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో 65 యేళ్లకుపైగా అనుభవం ఉన్న ప్రసిద్ధ సంస్థ రామ్‌కో సిమెంట్స్ తాజాగా రసాయన ఉత్పత్తుల కోసం 'హార్డ్ వర్కర్' బ్రాండ్‌ను ప్రారంభించింది. ఆవిష్కరణ, బలం, విశ్వాసం తెలియజేసే 'హార్డ్ వర్కర్' సరైన అప్లికేషన్ కోసం సరైన ఉత్పత్తులు అనే కంపెనీ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటుందని ఆ కంపెనీ సీఈవో ఏవీ ధర్మకృష్ణన్, మార్కెటింగ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీ కె.మూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎం.శ్రీనివాసన్, డైరెక్టర్ అభినవ్ రాజా మంగళవారం నగరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రామ్‌కో సిమెంట్ నిర్మాణ రసాయనాల విభాగం ఆదాయం రూ.210 కోట్లు, వచ్చే నాలుగు ఐదేళ్లలో రూ.2 వేల కోట్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం హార్డ్‌వర్కర్ బ్రాండ్ కింద 20 నిర్మాణ ఉత్పత్తులు ఉన్నాయని, మరో 20 ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించనున్నట్లు వెల్లడించారు.

10నుంచి ఢిల్లీలో 'అలుమెక్స్ ఇండియా'



మీడియా సమావేశంలో అలెమై నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (అలెమై) ఆధ్వర్యంలో వచ్చే సెప్టెంబరు 10వ తేదీ నుంచి న్యూ ఢిల్లీలో 'అలుమెక్స్ ఇండియా 2025' పేరుతో ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ప్రదర్శనలో 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 12,000 మందికి పైగా వ్యాపార సందర్శకులు పాల్గొంటారని అలెమై అధ్యక్షులు జితేంద్ర చోప్రా తెలిపారు. మంగళవారం ఆయన చెన్నైలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో అత్యంత పారిశ్రామికంగా అభివృద్ధిన రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడు అల్యూమినియం తయారీకి అత్యంత ముఖ్యమైన కేంద్రాల్లో ఒకటిగా అవతరించిందన్నారు. ప్రస్తుతం తాము ఏర్పాటు చేసిన ప్రదర్శన అల్యూమినియం పరిశ్రమ భవిష్యత్తులో తమిళనాడు పాత్రను ప్రదర్శిస్తుందన్నారు. పారిశ్రామిక బలం, నైపుణ్యం కలిగిన మానవశక్తి, ప్రపంచ కనెక్టివిటీ కలయికతో తమిళనాడు అల్యూమినియం రంగంలో బలమైన ఆటగాడిగా మారిందని, ఈ ప్రదర్శన ద్వారా తాము తమిళనాడు బలాలను హైలైట్ చేయదలిచామని వివరించారు.

ఏ పని అయినా అంకితభావంతో చేయండి

● క్రికెటర్ బద్రీనాథ్



క్రీడా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బద్రీనాథ్

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆటలో అయినా, జీవితంలో అయినా ఏ పనైనా వందశాతం అంకితభావంతో చేయాలని క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ సూచించారు. ఈ ప్రక్రియ నిజాయతీగా ఉండి, దాన్ని శారీరక శక్తితో కలిపితే ప్రతి సవాలును సిక్స్‌గా మార్చవచ్చన్నారు. చెన్నైలోనే అతిపెద్ద శిక్షణ అకాడమీ 'తిరం స్పోర్ట్స్ అకాడమీ' స్థానిక పూందమల్లిలో ఏర్పాటు చేసిన రెండో క్రీడా కేంద్రాన్ని సోమవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించిన బద్రీనాథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ ప్రకాష్, ఈడీ ఎస్ఎన్ శ్రీనివాస్, డైరెక్టర్ నవీన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

● వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో

ఐటీ ఉద్యోగికి క్యాన్సర్ కణితుల తొలగింపు



చికిత్స తర్వాత కోలుకున్న ఐటీ ఉద్యోగితో వైద్యనిపుణులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో ఐటీ ఉద్యోగికి రెండు క్యాన్సర్ కణితులను తొలగించే అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించి, పుర్రెను పునర్నిర్మించే ప్రక్రియ, మెదడుపై చర్మ కణాలను చక్కదిద్దటం, తొడలోని చర్మభాగంతో నుదుటిని చక్కదిద్దే ప్రక్రియ అంటూ వరుసగా చికిత్సలందించి సంపూర్ణంగా కోలుకునేలా చేసినట్లు ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు జి.కార్తికేయన్ తెలిపారు. హాస్పిటల్ ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఐటి ఉద్యోగి నుదుటి భాగంలో క్యాన్సర్ కణితిని తొలగించే చికిత్సలు చేస్తున్నప్పుడు అతడి శ్వాసకోశంలో మరో క్యాన్సర్ కణితి ఉన్నట్లు గుర్తించి దాన్ని కూడా తొలగించామన్నారు. ముందువైపు నుదుట క్యాన్సర్ కణితి వల్ల అందవిహీనంగా మారిన ముఖాన్ని చక్కదిద్దే శస్త్రచికిత్సలు వరుసగా జరపటంతో అతడి ముఖం మునుపటి స్థితికి చేరుకుందని చెప్పారు. సమావేశంలో ఈ వరుస శస్త్రచికిత్సలలో పాలుపంచుకున్న వైద్యనిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్యామ్‌నాథ్ కృష్ణ పాండ్యన్, సిమ్స్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజు శివసామి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తెలుగు సంఘ నేతలు జి.మురళి, సంపత్ తదితరులు

యేగాతమ్మకు వైభవంగా ప్రత్యేక పూజలు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్ కావాంగరైలో యేగాతమ్మన్ ఆలయంలో మంగళవారం ఉదయం లోకకల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పుళల్ కావాంగరై తెలుగు ప్రజా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు లయన్ జి.మురళి, బాలాజీ, సతీష్, మణి తదితరులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుత్తణిలో ఇంటింటికి రేషన్ పంపిణీ



రేషన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంకే నేతలు, నిర్వాహకులు

తిరుత్తణి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని వెంకటాపురంలో మంగళవారం సాయంత్రం ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ వాహనాన్ని ఆ ప్రాంత డీఎంకే నేతలు ప్రారంభించారు. తిరుత్తణి డీఎంకే పట్టణ ఇన్‌చార్జి ఏఎల్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజల సంక్షేమార్థం వివిధ రకాల పథకాలను అమలు చేస్తోందని, ఇందులో భాగంగా వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలంతా మళ్లీ డీఎంకే ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ దుకాణం డీలర్, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులు ఎదగాలి

● రచయిత్రి గుమ్మడి రామలక్ష్మి



విద్యార్థులతో గుమ్మడి రామలక్ష్మి, పీఎస్ మైథిలి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులు ఎదగాలని ప్రముఖ రచయిత్రి డాక్టర్ గుమ్మడిరామలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ) ఐక్యూఏసీ, సృజన తెలుగుభాషా మండలి చైతన్య-2025 సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన అంతర్ కళాశాలల పోటీల్లో రెండో రోజైన మంగళవారం తెలుగు విభాగం తరుపున ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎస్‌కేపీసీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ పీఎస్ మైథిలి ముఖ్యఅతిథి గుమ్మడి రామలక్ష్మిని సభకు పరిచయం చేశారు. నగరంలోని ప్రభుత్వ భారతి ఆర్ట్స్ కళాశాల, డీఆర్ బీసీసీసీ హిందూ కళాశాల షిఫ్ట్-1, షిఫ్ట్-2, కందసామి కళాశాల, షిఫ్ట్-1, షిఫ్ట్-2 తెలుగు మీడియంకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. తెలుగువారి సంస్కృతీసంప్రదాయాలు అనే అంశంపై విద్యార్థులు పత్ర సమర్పణ చేశారు. అనంతరం సాహిత్యం, జానపదం, పొడుపు కథలు, తికమక-మకతిక, ఆటాపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గుమ్మడి రామలక్ష్మి మాట్లాడుతూ... నగరంలో అంతరించిపోతున్న తెలుగు భాషను రక్షించుకోవడానికి, పునరుద్ధరించుకోవడానికి శ్రీకన్యకా పరమేశ్వరి కళాశాల దోహదం చేస్తోందని ప్రశంసించారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై మక్కువ పెంచడానికి ఏటా ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి నిర్వహిస్తున్న వక్తృత్వ, సాహితీ, పొడుపు కథల వంటి పోటీలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఎస్‌కేపీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వీబీ వనిత, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భరణికుమారి విజేతలను అభినందించారు.

నిధులివ్వండి ప్లీజ్!

● కేంద్ర విత్తమంత్రికి ఎంపీ కనిమొళి, మంత్రి తంగం తెన్నరసు వినతి



నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ కనిమొళి, మంత్రి తంగం తెన్నరసు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసు, లోక్‌సభ సభ్యురాలు కనిమొళి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆ ఇద్దరు నేతలు ఢిల్లీలో నిర్మలను కలుసుకుని ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అంతేగాక 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ బ్యాంక్ సాయం కింద గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు రూ.4,500 కోట్లు, మత్స్య మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఎఫ్ఐడీఎఫ్) కింద కుళచ్చల్ ఫిషింగ్ హార్బర్ విస్తరణకు రూ.350 కోట్లు సత్వరం అందించాలంటూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాసిన లేఖను కేంద్రమంత్రికి అందజేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు భారీగా నిధులు అవసరమవుతున్నాయని, అందువల్ల పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు నిర్మలకు విజ్ఞప్తి చేశారు.



ఇటీవల చెన్నైలో జరిగిన కళాసుధ తెలుగు అసోసియేషన్ శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకుడు డాక్టర్ కాసల నాగభూషణంకు 'కళాసుధ పండిత పురస్కారం' అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు


ఆకట్టుకున్న 'సైన్స్ ఎక్స్‌పో'



సైన్స్ ప్రాజెక్ట్‌లు ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేటలోని శ్రీ అమోలుక్‌చంద్ గలాడా జైన్ హయ్యర్ సెకండరీ స్కూలులో మంగళవారం సైన్స్ డిస్కవరీ హబ్ పేరుతో నిర్వహించిన అంతర్ పాఠశాల 'సైన్స్ ఎక్స్‌పో' విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ పీఏ నరేష్, చెన్నై నార్త్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏఎస్ ఇళిలరసి ముఖ్యఅతిథులుగా పాల్గొని ఎక్స్‌పో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆపిల్ పండు పైకి వేస్తే ఎందుకు కిందపడుతుంది అనే ప్రశ్నతో న్యూటన్ చేసిన పరిశోధనలు సైన్స్ అభివృద్ధికి నాంది పలికాయన్నారు. విద్యార్థులు కూడా మంచి ఆలోచనలు కలిగి ఉంటారని, వాటిని విని ప్రోత్సహిస్తే శాస్త్రవేత్తలుగా మారుతారన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేపట్టాలని వక్తలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ హనుమాన్‌చంద్ బోత్రా, సెక్రటరీ దల్జీత్ సింగ్ దాహా, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె.జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూస్థాన్ వర్శిటీలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఘనస్వాగతం



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, అతిథులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వర్శిటీ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ జాయింట్ జనరల్ మేనేజర్ ఆర్. సేనాపతి, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎస్. కన్నన్, కేవీఎం ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వికాస్, ఛాన్స్‌లర్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

బిగ్ సినీ ఎక్స్‌పో ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సినీ ప్రముఖులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో 'బిగ్ సినీ ఎక్స్‌పో' ప్రారంభమైంది. ఈ 8వ ఎడిషన్ సినీ ప్రదర్శన థియేటర్ పంపిణీ పరిశ్రమకు ఆసియాలోని ఏకైక సమావేశం కావడం విశేషం. థియేటర్ వరల్డ్ నిర్వహించిన ఈ ప్రదర్శన సింగిల్-స్క్రీన్ సినిమాహాళ్లు, మల్టీప్లెక్స్‌లు, పరిశ్రమ వాటాదారులకు ప్రధాన వేదికగా నిలిచింది. బుధవారం కూడా కొనసాగనున్న ఈ ప్రదర్శనను తమిళనాడు సినిమాథియేటర్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పన్నీర్‌సెల్వం, థియేటర్ వరల్డ్ వ్యవస్థాపకుడు సందీప్ మిట్టల్, బిగ్ సినీ ఎక్స్‌పో డైరెక్టర్ రాఘవేంద్ర, జీటీసీ ఇండస్ట్రీస్ భాగస్వామి యూసఫ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విస్తృతమైన షో ఫ్లోర్, లైవ్ టెక్నాలజీ డెమోలు, ఉత్పత్తి ప్రదర్శనలు, స్టూడియో ప్రజెంటేషన్లు, ఫిల్మ్ స్క్రీనింగ్‌లు, సెమినార్లు, ప్యానల్ చర్చలు ఏర్పాటు చేశారు. ఆసియాలోని థియేటర్ యజమానులు, కన్సల్టెంట్లు, పంపిణీదారులు, స్టూడియోల అధినేతలు, పరికరాల తయారీదారులు, ఇంటిగ్రేటర్లు, నిపుణులు కూడా హాజరయ్యారు.

గ్లెనీగల్స్ ఆస్పత్రిలో బెల్జియం వ్యక్తికి అరుదైన చికిత్స



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్య బృందం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొంతులో కణితి కారణంగా 15 సంవత్సరాలుగా ఆహారం తీసుకోలేక ఇబ్బంది పడుతున్న బెల్జియంకు చెందిన 75 ఏళ్ల వ్యక్తికి నగరంలోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్యులు 'జీ-పోయం' (పెర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటమీ) ప్రక్రియను ఉపయోగించి అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తీవ్రమైన వాంతులు, నిరంతరం దగ్గు, అజీర్తి కారణంగా ఇబ్బంది పడిన బెల్జియం వ్యక్తిని పరీక్షించిన గ్లెనీగల్స్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, థెరప్యూటిక్ ఎండోస్కోపి విభాగాధిపతి బి.మహాదేవన్ నేతృత్వంలోని వైద్యబృందం ఈ చికిత్స నిర్వహించింది. ప్రస్తుతం ఆ రోగి కోలుకున్నట్లు మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ మహదేవన్ తెలిపారు.





రమ్యశ్రీ,ఆమని - ప్రియదర్శి

తిరుమలలో సినీ నటుల సందడి

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. వీరిలో ఆమని, రమ్యశ్రీ, ప్రియదర్శి ఉన్నారు. ఇంకా తెలంగాణ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజున కుటుంబం అంతా కలిసి స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో నీటి నిల్వలపై అదనపు ఈవో సమీక్ష



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నీటి నిల్వలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లోని డ్యాముల్లో నీటి లభ్యత, వినియోగంపై చర్చించారు. తిరుమలలోని గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, తిరుపతిలోని కల్యాణి డ్యాముల్లో ప్రస్తుతం భక్తుల అవసరాలకు నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు నివేదించారు. భవిష్యత్తులో నీటి నిల్వల సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని అదనపు ఈవో సూచించారు. ఈ సమీక్షలో వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిది షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.88 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,502

తలనీలాలు సమర్పించినవారు: 31,890



మఠం భవనాల కూల్చివేతకు తొందరపడం

● ప్రత్యక్షంగా పరిశీలించాకే నిర్ణయమన్న కలెక్టర్ ● ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం నడిబొడ్డున గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం పరిపాలనా భవనం కూల్చివేత నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. రెండంతస్తుల ఈ పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకర స్థితిలో ఉన్న పై అంతస్తునూ, అదే స్థితిలో ఉండే కింది అంతస్తులోని షాపింగ్ గదులనూ కూల్చివేయచ్చంటూ దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానికంగా నిరసనలు మొదలయ్యాయి. తమ బతుకు తెరువుతో ముడిపడిన అంశమని షాపుల వాళ్లు అభ్యంతరం తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇతర ప్రజాప్రతినిధులు, మఠం, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. పలువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కూల్చకుండా ప్రయత్నిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

భవనాన్ని పాక్షికంగా కూల్చాలని మాత్రమే ఆదేశాలు వచ్చాయని, 62 షాపుల్లో కేవలం 12 మాత్రమే కూలుస్తారని, అవి కూడా కొట్టకుండా పునరుద్ధరించే అవకాశముందేమో చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ భవనం స్థితిగతులను పరిశీలించేందుకు ఐఐటీ నిపుణులకు కలెక్టర్ లేఖ రాయాలని కోరారు. అలాగే హథీరాంజీ మఠం తిరుపతికి గుండె లాంటిదంటూ, ఆధునిక టెక్నాలజీని వాడుకుని భవనాన్ని పరిరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ సూచించారు. భవనాన్ని ఎలా నిలబెట్టాలో ఆలోచించాలని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ కోరారు. ఇదే వయసున్న భవనాల విషయంలో టీటీడీ ఏం చేస్తోందో పరిశీలించాలని సూచించారు. 'తిరుపతిలో ఇంట్లో చావైనా, పెళ్లైనా ముందుగా వెళ్ళేది మఠం భవనంలో నడుస్తున్న పువ్వుల దుకాణాలకే. వాటిని కూల్చవద్దు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. రిట్రోఫిట్టింగ్ విధానంలో మఠం భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసే వీలుంది.' అని టీడీపీ నేత ముబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. తిరుపతికి ల్యాండ్ మార్క్ ఈ భవనాన్ని కూల్చకుండా కాపాడాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఒకవేళ మఠం భవనాన్ని కూల్చేసి తిరిగి కడితే ఇపుడున్న వ్యాపారులకే మళ్లీ షాపులు కేటాయిస్తారా? అని నగర బీజేపీ అధ్యక్షుడు వరప్రసాద్ ప్రశ్నించారు. కూల్చకుండానే పునరుద్ధరించి ఇపుడున్న వ్యాపారులకే ఆ షాపులు ఇస్తామంటే తక్షణం షాపులు ఖాళీ చేస్తామని కార్పొరేటర్ నరసింహాచారి చెప్పారు.



భవనం కూలితే బాధ్యత ఎవరిది?

● ప్రశ్నించిన కలెక్టర్

అందరి అభిప్రాయాలూ తెలుసుకున్న తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, వందేళ్లకు పైబడిన పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుందని, అది కూలిపోయి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని సూటిగా ప్రశ్నించారు. వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. తమ మొదటి ప్రాధాన్యత మనుషుల ప్రాణాలు కాపాడ్డమేనని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ అభ్యర్థనపై తిరుపతి ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారని, అనేక భాగాలు ప్రమాదకర స్థితిలో వున్నాయని నివేదిక ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే దేవాదాయ శాఖ కమిషనర్ భవనం కూల్చివేతకు టెండర్లు పిలిచారన్నారు. అయితే షాపుల్లో అద్దెకు వుంటున్న వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు రావడంతో తాత్కాలికంగా టెండర్ల అమలును నిలిపేతామని ప్రకటించారు. ఎమ్మెల్యే, కమిషనర్ సహా ప్రజాప్రతినిధులు, నేతలు, మఠం అధికారులు అందరితో కలసి వారం రోజుల్లో మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తామన్నారు. దానికి తిరుపతి ఐఐటీ, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ప్రత్యక్షంగా చూసిన తర్వాతే భవనం కూల్చివేతపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసి పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంస్థకూ, పురావస్తు శాఖకు, ఐఐటీకి తానే లేఖలు రాస్తానన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో షాపులు తాత్కాలికంగా ఖాళీ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అది కూడా తాము భవనాన్ని నేరుగా పరిశీలించాకే అవసరమైతేనే ఖాళీ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, హథీరాంజీ మఠం ఇంచార్జి ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బంజారా సంఘాల ప్రతినిధులు, షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన కింద ఇరుక్కున్న ట్యాంకర్

● గంటన్నరకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం



రేణిగుంట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని రైల్వే వంతెన కింద గ్యాస్ ట్యాంకర్ ఇరుక్కుంది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలకు గ్యాస్ తీసుకెళ్లే ట్యాంకరుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని భావించారు. శ్రీకాళహస్తి వైపు నుంచి ఖాళీ గ్యాస్ ట్యాంకరుతో తిరుపతి అర్బన్ మంగళంలోని ఆర్టీవో కార్యాలయానికి బయలదేరారు. దారి తెలియక పాత చెక్‌పోస్టు మీదుగా రైల్వే వంతెన కింద ట్యాంకరును వెళ్లనిచ్చారు. ఈ క్రమంలో భారీ పరిమాణం కలిగిన ట్యాంకరు ఆ దారిలో ఇరుక్కుపోయింది. దాదాపు ఒకటిన్నర గంటసేపు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్సు చిక్కుకు పోయింది. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అబార్షన్ కిట్లు, డ్రగ్స్ స్వాధీనం

వరదయ్యపాళెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలోని ఓ మందుల దుకాణంలో చట్టవిరుద్ధంగా విక్రయి స్తున్న అబార్షన్ కిట్లను, డ్రగ్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నారు.మండలకేంద్రంలోని మందుల దుకాణాల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (శ్రీకాళహస్తి) ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఓ మందుల దుకాణంలో ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న 140 అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. రోగులకు మత్తు ఇవ్వడానికి వినియోగించే డ్రగ్స్‌ను అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

తిరుమల ఏటీఎంలో కర్ణాటక వాసి హంగామా



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం రాత్రి ఒక వ్యక్తి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నానా హంగామా సృష్టించాడు. రాత్రి 11.30 గంటల సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ముందున్న ఏటీఎంలోకి ప్రవేశించిన అతడు పలుచోట్ల వైర్లను కట్ చేశాడు. అనంతరం ఏటీఎం మిషన్ చుట్టూ అనుమానాస్పదంగా తిరిగాడు. ఈ దృశ్యాలన్నీ మరో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో బ్యాంక్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం ఉదయం కల్యాణకట్ట వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకకు చెందిన ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించామని, మానసిక స్థితి సరిగాలేదని సీఐ శ్రీరాముడు తెలిపారు. అయినప్పటికీ గతంలో ఏవైనా నేరాలకు పాల్పడ్డాడా అనే కోణంలోనూ విచారిస్తున్నామన్నారు.

అటువంటి ఆలయం ఇక్కడొద్దు

● కొండూరులో గుడి నిర్మాణంపై గ్రామస్తుల అభ్యంతరం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు శరత్‌బాబు

తడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని కొండూరులో వివాదస్పదంగా మారిన దేవాలయ నిర్మాణం విషయమై మంగళవారం తహసీల్దారు శరత్‌బాబు గ్రామసభ నిర్వహించారు. గుంట పోరంబోకు భూమిలో చాముండేశ్వరిదేవి ఆలయం పేరుతో నిర్మాణాలు మొదలుపెట్టి, అందులో చేతబడులు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కొండూరులో గ్రామసభ నిర్వహించి స్థానికుల అభిప్రాయాలు తీసుకుని నివేదిక పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. దీంతో తహసీల్దారు గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో పాటు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు వంతులకుపైగా గ్రామస్తులు అటువంటి దేవాలయం ఇక్కడ వద్దని, వెంటనే దానిని తొలగించాలంటూ తహసీల్దారుకు విన్నవించారు. తమకు సమాచారం ఇవ్వకుండా, అజెండాలో పేర్కొనకుండా దేవాలయ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడంపై పలువురు వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపారు. వెంటనే వార్డుసభ్యుల సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను నమోదు చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీ అధికారులను తహసీల్దారు ఆదేశించారు. ఈ నివేదికలన్నింటిని ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు కొండపనాయుడు, బ్రహ్మానాయుడు, సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.పది లక్షల విరాళం అందింది. బెంగళూరుకు చెందిన వినుత గణేష్ ఈ విరాళ చెక్కును తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో ముందస్తు తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారన్న సమాచారం తెలియడంతో మంగళవారం స్టేషన్‌లో అధికారులు ముందస్తు తనిఖీలు చేశారు. బాధ్యతలు చేపట్టిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ స్టేషన్‌లో ఏ ప్రాంతంలో పర్యటిస్తారో తెలియక అన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నపరెడ్డిలతో పాటు కమర్షియల్, ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





అవార్డు అందుకుంటున్న లావణ్య కుమార్, సాయికుమార్

అవార్డులందుకున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన తిరుపతి 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్య కుమార్, కె.సాయికుమార్ అవార్డులు స్వీకరించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ల్యాప్ ట్యాప్‌ల చోరీ ఆ ఆగంతకుడి పనేనా?

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు

● ఐఐటీలో భద్రతా వైఫల్యంపై విమర్శలు

ఏర్పేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో ల్యాప్‌టాప్‌ల చోరీ కలకలం రేపింది. శనివారం హాస్టల్ భవనాల్లో విద్యార్థులకు చెందిన 8ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయిన సంగతి తెలిసిందే. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో జరిగిన ఈ చోరీ ఘటనపై విచారణకు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఐఐటీని సందర్శించారు. హాస్టల్ భవనాలను తనిఖీ చేశారు. బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీతోపాటు పలు సాంకేతిక అంశాల ద్వారా నిందితుడ్ని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరా దుండగుడు?

శనివారం ఓ ప్రొఫెసర్ పేరుచెప్పి ఓ వ్యక్తి ఐఐటీలోకి వచ్చినట్లు తెలుస్తోంది. తమ పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవడానికివెళుతున్నానని అతడు చెప్పినట్లు సమాచారం. ఈక్రమంలో హాస్టల్ గదుల్లో ఎనిమిది మంది విద్యార్థుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి తన వాహనంలో పెట్టుకుని ప్రధాన మార్గంలోనే వెళ్లిపోయాడని భావిస్తున్నారు. ఈ విషయంలో భద్రతా సిబ్బంది తీరు విమర్శలకు దారితీస్తోంది. ఆగంతకుడు సులభంగా లోపలికి రావడం, వెళ్తున్నప్పుడు తనిఖీ చేయకపోవడం చోరీకి ప్రధాన కారణమంటున్నారు. దుండగుడు లోపలికి ప్రవేశించడం వెనుక ఐఐటీకి చెందిన ఓ అధికారి హస్తమున్నట్లు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



పురుషుల హాకీ విజేత



మహిళల హాకీ విజేత

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాప్ నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి 2,362మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ క్రీడాంశాలలో తలపడ్డారు. రెండు రోజులుగా ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలు బాలబాలికలతో కళకళలాడాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. విజేతజట్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పురుష విభాగంలో ఆర్చరీలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఒకరు, షటిల్ బాడ్మింటన్ ఒకరు, బాక్సింగ్‌లో 10మంది, హాకీ జట్టు, వాలీబాల్ జట్టు, మహిళా విభాగంలో ఆర్చరీలో ఒకరు, అథ్లెటిక్స్‌లో ఇద్దరు, షటిల్‌బ్యాడ్మింటన్ ఇద్దరు, బాక్సింగ్‌లో ఏడుగురు, హాకీ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

డీఫార్మసీ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డీఫార్మసీ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకానాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ఫార్మసీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు. ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈనెల 30న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. తెల్లరేషన్ కార్డు లేదా ప్రభుత్వ నిబంధనల మేరకు ఇన్‌కం సర్టిఫికెట్ ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. మరిన్ని వివారలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని లేదా కళాశాలలో ఫార్మసీ విభాగంలో లేదా 99088 57585, 99667 61446, 99635 41557 నంబర్లలో సంప్రదించవచ్చు. apsbtet.in/pharmacy లింక్‌ను ఉపయోగించి ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చు.

వైసీపీ జెండాలతో తిరుమలకు పాదయాత్ర

● అడ్డుకుని 10మందికి పోలీసుల అనుమతి

చంద్రగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితుడు ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వైసీపీ కార్యకర్తలనుచంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శనివారం వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పీలేరు నుంచి పార్టీ జెండాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీనివాసమంగాపురానికి చేరుకున్నారు. పార్టీ జెండాలతో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్ళకూడదని డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీవారి మెట్టు మార్గంలో ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని 10 మందిని అనుమతిస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే 10 మంది కాకుండా పోలీసుల కళ్లు గప్పి మరో ఆరుగురు వెళ్ళారు. దీంతో టీటీడీ సెక్యూరిటీ, పోలీసులు అప్రమత్తమై ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.





శ్రీవారిమెట్టు మార్గంలో ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు - వైసీపీ జెండాలతో వాహనం

చట్టనిబంధనల ప్రకారం నడుచుకోండి

- ఆ భూమి విషయంలో ఏ చర్యలు తీసుకున్నా

● భూమన కుటుంబ సభ్యుల భూఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం

● తహసీల్దారు ఇచ్చిన నోటీసు రద్దు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పరిధిలో వైసీపీనేత భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 9.33 ఎకరాల నదీ పోరంబోకు ఆక్రమణ వ్యవహారంలో ఏ చర్యలు తీసుకున్నా చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తహసీల్దారు ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంటూ దానిని రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పరిధిలోని సర్వేనెం. 479లోని 9.33 ఎకరాల నదీ పోరంబోకు భూమిని ఆక్రమించారని, అందులోని నిర్మాణాలను తొలగించాలని తిరుపతి గ్రామీణ మండలం తహశీల్దార్ ఈనెల 11న ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భూమన కరుణాకర్‌రెడ్డి భార్య జంగా రేవతి, కుమారుడు అభినయ్ హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఆ భూమిని 2001-02లో కొనుగోలు చేశారన్నారు. తహశీల్దార్ ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. సంబంధిత భూమి నదీ పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను నోటీసుకు జత చేయలేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు భూమిని ఆక్రమించారనేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగానే నోటీసులు జారీ చేశామన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి

● విద్యార్థులకు డీఈవో పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీ హైస్కూల్లో మంగళవారం జరిగిన ఇన్‌స్పైర్ అవార్డ్స్-2025 నామినేషన్ల ఒకరోజు శిక్షణా తరగతిలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భగా డీఈవో మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్లలో మన జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు వేయాలన్నారు. ప్రదర్శనాంశాలు వినూత్నంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ శివ శంకరయ్య, ఏఎస్ఓ సారథి, ఎస్వీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సంధ్య, డీవైఈవో ఇందిరాదేవి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, రిసోర్స్ పర్సన్లు నీలకంఠ, మేఘనాథ్, హరిశంకర్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.